క్లుప్తంగా

ఆంగ్ల భాషతో భవిష్యత్తులో ప్రయోజనాలు



అంబాజీపేటలో విద్యార్థినికి బహుమతి ఇస్తున్న సీఐ ప్రశాంత్‌కుమార్, ఎంఈఓ–2 ప్రకాష్

అంబాజీపేట: ప్రస్తుత పోటీ ప్రపంచంలో తెలుగుతో పాటు, అధిక ప్రాధాన్యం ఉన్న ఇంగ్లిష్‌ను ప్రతి విద్యార్థి ఇష్టంగా నేర్చుకోవాలని ఎంఈఓ–2 మోకా ప్రకాష్, పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన వినాయక యాడ్స్ ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన ఉచిత ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతుల శిక్షణ ముగింపు కార్యక్రమం బొంతు రమేష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ, సీఐ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న ఇంగ్లిష్‌ను ప్రతి రోజు అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో ప్రయోజనం ఉంటుందన్నారు. అనంతరం ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వల్లూరి జ్యోతి, వి.ఐశ్వర్య, ఏఎస్ఎస్ ప్రసన్నకు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణా తరగతులకు హాజరైన వారికీ ప్రత్యేక బహుమతులు ఇచ్చారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: ఈతకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ఏపీ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ ఆదివారం తెలిపారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరునగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఉమా సోమలింగేశ్వరుని కల్యాణం

ఆత్రేయపురం: ర్యాలి గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత ఉమా సోమలింగేశ్వర స్వామి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భారీ అన్న సమారాధన

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో ఉన్న దాసాంజనేయ స్వామివారి ఆలయం వద్ద ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామికి సింధూర పూజ, తమలపాకుల పూజ నిర్వహించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, మొక్కుబడులు, కానుకలు సమర్పించారు.

పోతవరంలో బడి బాట



పోతవరంలో తల్లిదండ్రులను కలిసిన హెచ్‌ఎం ఆనందరావు

పి.గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పోతవరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కత్తుల ఆనందరావు అన్నారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని కోరుతూ ఆదివారం ఆయన ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులను కలుసుకుని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న బోధన, మౌలిక సదుపాయాలను వివరించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ సభ్యుల రాజీనామా

అలమూరు: మండలంలో ఉన్న ఎనిమిది ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల అధ్యక్షులు, సభ్యులు ఆదివారం తమ పదవులకు రాజీనామా చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో అధికారం కోల్పోయినందుకు నైతిక బాధ్యత వహిస్తూ, ఆలమూరు, జొన్నాడ, చొప్పెల్ల, చింతలూరు, పెదపళ్ల, మోదుకూరు, నర్సిపూడి, పెనికేరు గ్రామాలకు చెందిన త్రిసభ్య కమిటీ ఈ మేరకు రాజీనామా పత్రాలను సీఈఓల సహకారంతో జిల్లా కలెక్టర్‌కు పంపించారు.

సర్కారు బడి.. చేరికల సందడి



అవిడి గ్రామంలో పిల్లల తల్లిదండ్రులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం అరుణశ్రీ

వేసవి కాలం పోయింది. ఇప్పుడు చదువుల కాలం మొదలు కానుంది. వర్షా కాలంలో కురవాలా, వద్దా అన్నట్టుగా అడపాదడపా వానలు పడుతుండగా.. ప్రైవేటు విద్యాసంస్థల్లో పిల్లలను చేర్పాలంటూ వారి సిబ్బంది మాత్రం ఠంచనుగా వాలిపోతున్నారు. తమ విద్యాసంస్థే అన్నింటి కన్నా గొప్పదంటూ బీరాలు పలుకుతున్నారు. వీరి వాలకం చూసిన సర్కారు బడుల మాస్టార్లు.. తామేమీ తక్కువ కాదంటూ.. ఇంటింటి ప్రచారం మొదలెట్టారు. ఫ్లెక్సీలు, కరపత్రాలు ముద్రించి.. చదువులోనే కాదు.. ప్రచారంలోనూ కార్పొరేట్‌కు దీటుగా జవాబిస్తామంటున్నారు.

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- నూతన అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి
- ప్రైవేట్ సంస్థల తరహాలో ఉత్తమ ఫలితాల ప్రచారం
- 12న పాఠశాలల పునః ప్రారంభం

కొత్తపేట: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. వారికి ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా సర్కార్ పాఠశాలలను తీర్చిదిద్దడంతో, వీటిలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఆ దిశగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి పర్యవేక్షణలో, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు విశేష కృషి చేస్తున్నారు.

ఫ్లెక్సీలతో ప్రచారం

పలు ప్రభుత్వ పాఠశాలలు.. ప్రైవేట్ పాఠశాలల తరహాలో వినూత్నంగా ప్రచారం చేపట్టాయి. 2023–24 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో పలు పాఠశాలల విద్యార్థులు సాధించిన అద్భుత ఫలితాలను ప్రచారాస్త్రాలుగా వినియోగించుకుంటున్నాయి. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మెరిట్ విద్యార్థుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ఆయా పాఠశాలల వద్ద ఏర్పాటు చేసి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నాయి. వివిధ పోటీ పరీక్షల్లో విద్యార్థుల విజయాలను అందులో ప్రస్తావించారు. ఆయా పాఠశాలల సమీప ప్రాంతాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, ప్రభుత్వ పాఠశాలల్లో గడచిన విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలను వివరిస్తూ, ఉత్తమ విద్యార్థులు, వారికి వచ్చిన ఉత్తమ ఫలితాలు, వారి ఫొటోలతో ముద్రించిన కరపత్రాలు పంచుతున్నారు. ఆయా పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు, తమ పాఠశాలల్లో చదువుకోవడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో తమ పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులు, నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పొందిన విద్యార్థులు, ముఖ్యంగా తమ పాఠశాలల్లో పిల్లలకు లభించే సదుపాయాలు, పుస్తకాలు, దుస్తులు, ఎనిమిదో తరగతిలో లభించే ట్యాబ్‌లు తదితర వాటిని వివరిస్తున్నారు. పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలంటూ తల్లిదండ్రులను కోరుతున్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నారు.

ఒత్తిడి లేని నాణ్యమైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు. ఒత్తిడి లేని నాణ్యమైన విద్య లభిస్తోంది. మౌలిక సదుపాయాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపొందాయి. ఆయా అంశాలను ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నారు. అడ్మిషన్లు గణనీయంగా పెంచేందుకు కృషి చేస్తున్నారు.

– మట్టపర్తి హరిప్రసాద్, ఎంఈఓ, కొత్తపేట

ప్రగతిని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం



ప్రభుత్వాలు విద్యకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల స్థాయిలో ఈ పాఠశాలలను అభివృద్ధి చేసి, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాయి. చదువుకునే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాయి. దానితో పిల్లలు ఆసక్తిగా చదువుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థి ఎస్ నవనీత్ 593/600 మార్కులతో జిల్లా స్థాయి రెండో ర్యాంక్ సాధించాడు. 20 మంది 500 నుంచి 590 వరకూ మార్కులు పొందారు. ఆయా అంశాలన్నీ ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం. అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– కె.అరుణశ్రీ, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, అవిడి చప్పిడివారిపాలెం

పశువులకు పొంచి ఉన్న ముప్పు

- గొంతు వాపుతో వాటి ఆరోగ్యానికే ప్రమాదం
- నేటి నుంచి గేదెలు, ఆవులకు వ్యాధి నిరోధక టీకాలు



అంబాజీపేటలోని ఓ పశువుల శాలలో ఉన్న గేదెలు, ఆవులు

అంబాజీపేట: తొలకరి జల్లులు కురవడం ప్రారంభమవడంతో పాడి పశువుల్లో అనేక వ్యాధులు బయటపడే అవకాశం ఉంది. వీటిలో గొంతువాపు వ్యాధి ప్రధానమైనది. వేసవి కాలం ముగిసి, వర్షా కాలం ప్రారంభమైన వెంటనే గేదెలకు మొదట వచ్చే వ్యాధి గొంతు వాపు. రైతులు జాగ్రత్తగా ఉండకపోతే పశువుల్లో ఈ వ్యాధి ముదిరి, అనేక రకాల నష్టాలు జరిగే ప్రమాదం ఉంది. పశువులకు వైద్య సేవలందించేందుకు గ్రామాల్లో పశు సంవర్థక శాఖ వైద్యశాలలు ఉన్నాయి. కదల్లేని స్థితిలో ఉన్న గేదెలు, వైద్యశాలకు తరలించలేని పరిస్థితుల్లో ఉన్న పశువులను సకాలంలో వైద్యశాలలకు చేర్చి, వైద్య సేవలందించేందుకు గత ప్రభుత్వం అంబులెన్సులను ఏర్పాటు చేసి, వైద్యాన్ని పశువుల చెంతకే చేర్చింది. సోమవారం నుంచి గేదెలు, ఆవులకు వ్యాధి నిరోధక టీకాలు అందజేసే కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

వ్యాధి లక్షణాలు

చొంగ కారడం, జ్వరం రావడం, శ్వాసలో ఇబ్బంది, మేత మేయకపోవడం, పాల దిగుబడి తగ్గడం వంటివి వ్యాధి లక్షణాలుగా కనిపిస్తాయి. గేదెల్లో గొంతు వాపు వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే హెచ్ఎస్ వ్యాక్సిన్ టీకాలను వేయించాలి. పశు వైద్యశాలల్లో సిబ్బంది, అంబులెన్స్‌లో సిబ్బంది ఈ వ్యాక్సిన్లు గేదెలకు వేస్తారు. మనుషులు మాదిరిగానే సకాలంలో పశువైద్య సేవలందించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1963 పనిచేస్తుంది. ఈ నంబరుకు ఫోన్ చేసిన వెంటనే రైతు ఇంటికే అంబులెన్స్ వచ్చి, బాధిత పశువులకు వైద్య సిబ్బంది సేవలు, చికిత్స అందిస్తారు.

ఆయా నియోజకవర్గాల్లో పశువుల వివరాలు ఇలా ఉన్నాయి

నియోజకవర్గం	ఆవులు	గేదెలు
పి.గన్నవరం	9,500	12,300
కొత్తపేట	7,300	9,200
రాజోలు	6,100	9,450
మొత్తం	22,900	30,950

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులంతా ఈ సీజన్ ప్రారంభ కాలంలో ప్రతి రోజూ గేదెను పరీక్షించాలి. అనారోగ్య లక్షణాలను గుర్తించాలి. లక్షణాలు గుర్తించిన వెంటనే గేదె నడవగలిగితే వైద్యశాలకు తీసుకురావాలి. నడవలేని పక్షంలో పశువైద్య సేవలకు ఏర్పాటు చేసిన అంబులెన్స్ ద్వారా పశువైద్య సేవలను అందించాలి.

– డి.రాజేంద్రప్రసాద్, పశు వైద్యాధికారి, అంబాజీపేట

ప్రకృతి పరచిన పూలబాట



కొత్తపేట-పలివెల కెనాల్ రోడ్డులో తురాయి చెట్లు

జ్యేష్ఠ మాసం.. గ్రీష్మ రుతువు వచ్చిందంటే చాలు తురాయి చెట్లు కనువిందు చేస్తాయి. ఆహ్లాదాన్ని పంచుతాయి. ఉమ్మడి తూర్పుగోదారి జిల్లాలో అనేక చోట్ల జాతీయ, ఆర్అండ్‌బీ, స్థానిక రహదారుల వెంబడి ఉన్న వివిధ రకాల చెట్లలో ఎక్కువగా తురాయి చెట్లు కనిపిస్తాయి. ప్రస్తుత జ్యేష్ఠ మాసంలో ఆ చెట్లంతా నిండుగా ఎర్రని పూలు పూస్తాయి. ఆకులు కనిపించకుండా పుష్పాలే కనిపిస్తూ, రహదారులకు అందాన్ని తీసుకువచ్చాయి. ఆయా రహదారుల్లో ప్రయాణించే వాహనదారులను స్వాగతిస్తున్నట్టుగా ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రాంతానికి వచ్చిన రాష్ట్రేతర వాసులు ఈ తురాయి పుష్ప సోయగాలు చూసి పులకిస్తున్నారు.

– కొత్తపేట

బ్యాడ్మింటన్ విజేతలకు అభినందనలు



షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

అమలాపురం టౌన్: రోటరీ యువజన వారోత్సవాల క్రీడా పోటీల్లో అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ వేసవి ఉచిత క్రీడా శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులు షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో విజేతలుగా నిలిచారు. అండర్–13 బాలుర, అండర్–15 బాలికల విభాగాల్లో మొత్తంగా 17 మంది విద్యార్థులు గెలుపొందారు. ఆదివారం స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో విజేతలను ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ, అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, కార్యదర్శి ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రంకిరెడ్డి కాశీ, తిక్కిరెడ్డి సురేష్ అభినందించారు.

ఎరుకుల హక్కుల సంఘ అధ్యక్షుడు ఏడుకొండలు మృతి



బండారు ఏడుకొండలు(ఫైల్)

అమలాపురం టౌన్: స్థానిక ఏఎంజీ కాలనీకి చెందిన పట్టణ ఎరుకుల హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండారు ఏడుకొండలు(57) మెదడు సంబంధిత వ్యాధితో ఆదివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏడుకొండలు సోదరుడు, స్థానిక కౌన్సిలర్ బండారు గోవిందును పలువురు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎరుకుల హక్కుల కోసం పలు పోరాటాలు, ఉద్యమాలు చేసిన ఏడుకొండలు మృతిపై ఆయన సామాజిక వర్గీయులు ఆవేదనం వ్యక్తం చేశారు. సంతాపం తెలిపినవారిలో ఎరుకుల హక్కుల సంక్షేమ సంఘం ప్రతినిధి ఉప్పు శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ, న్యాయవాది ఆర్.శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



మోరి పాఠశాల ఆవరణలో ఎస్టీయూ జెండా ఆవిష్కరించిన నాయకులు

సఖినేటిపల్లి: మండలంలోని మోరి మెయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) 78వ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. సంఘ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాసు అధ్యక్షత వహించారు. సంఘ జెండాను సీనియర్ నాయకుడు గుర్రం పెద్దిరాజు ఆవిష్కరించారు. సంఘ నిర్మాణం, చరిత్రను పలువురు నాయకులు వివరించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఉండపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఉండపల్లి గిరిబాబు, నాయకులు కేవీ నాగేశ్వరరావు, కంచి నాగరాజు, ఎం.సత్యనారాయణ, జె.వీర్రాజు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కూటమి నేతల సంబరాలు

కొత్తపేట: కేంద్రంలో మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారోత్సవ వేళ కొత్తపేటలో ఎన్డీఏ నాయకులు సంబరాలు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ఆధ్వర్యంలో ఆయన స్వగృహం వద్ద ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసిన పాలూరి, కేక్ కట్ చేశారు. బీజేపీ నిర్ణయాలకు దేశ ప్రజలు ఆమోదం తెలిపి, మూడోసారి ఎన్డీఏకు అధికారం కట్టబెట్టారన్నారు.

నగరంలో..

మామిడికుదురు: కేంద్రంలో ఎన్డీఏ అధికారం చేపడుతుండడంతో బీజేపీ నేతలు ఆదివారం నగరం గ్రామంలో విజయోత్సవం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నేత వానరాశి త్రిమూర్తులు స్వగృహం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. బాణసంచా కాల్చారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పి.గన్నవరం మూడు రోడ్ల సెంటర్లో ఆదివారం బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు.

సఖినేటిపల్లి: ప్రధానిగా మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టడంతో గొంది‌లో బీజేపీ కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చెంపాటి శివ రామకృష్ణంరాజు, మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు, తదితరులు సంబరాలు చేశారు. వీరితో పాటు టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాల వేళ మాంసాహారంతో ముప్పే

- బాక్టీరియా, వైరస్ సోకే ప్రమాదం
- వర్షాకాలంలో వృక్ష సంబంధిత ఆహారం మేలు




గొర్రెల మంద

కపిలేశ్వరపురం: నాలుక కోరుకునే రుచుల కోసం ఎల్లవేళలా పాకులాడడం మానవ సహజం. అయితే ఆ తరహా కోరికలకు అంటూ కాలానుగుణంగా మినహాయింపు ఉంటాయని గమనించాలి. వాతావరణ మార్పులు మానవ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. శరీరం నిర్దిష్ట ఉష్ణోగ్రతలో ఉండాలి. వర్షాకాలంలో మానవ శరీరం చల్లటి వాతావరణానికి లోనవుతుంది. దీనికి తోడు వర్షాలకు బ్యాక్టీరియా, వైరస్‌లు వృద్ధి చెంది ప్రతికూల పరిస్థితులను కలిగిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో సూక్ష్మ క్రిములు మాంసంలో నాణ్యత, క్షీణత కలిగిస్తాయి. వాటి ప్రభావానికి లోనైన మాంసాన్ని ఆహారంగా తీసుకున్న వారికి తలనొప్పి, వాంతులు, జ్వరం, నీళ్ల విరేచనాలు కలుగుతాయి. ఇక నిల్వ మాంసం తింటే పరిస్థితి విషమంగా మారుతుంది. మండపేట, రామచంద్రపురం, అంగర తదితర ప్రాంతాల్లో మార్కెట్ల ద్వారా పెద్ద ఎత్తున మాంస విక్రయాలు సాగుతాయి. పట్టణాల్లో పెద్ద ఎత్తున రెస్టారెంట్లు, బిర్యానీ పాయింట్లు నిర్వహిస్తున్నారు. పలుమార్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు మండపేటలో నిల్వ మాంసాహారాన్ని గుర్తించి నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇలాంటి నేపథ్యంలో వర్షాలు పడుతున్న కాలంలో మాంసాహారాన్ని భుజించడం మానడం మేలు. తప్పని పరిస్థితి అనుకుంటే మాంసం కొనుగోలు, వండే పద్ధతిలపై పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. మాంసాహారాన్ని భుజించడం వల్ల కలిగే పరిణామాలపై కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు తెలిపిన వివరాలు ఇలా...

వర్షాకాలంలో మాంసాహారంతో ఇబ్బందులు

వాతావరణ మార్పుల వల్ల మాంసం తిన్న వారిలో బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు కలుగుతాయి. సహజంగా పశువులకు కూడా వర్షాకాలంలో పలు ఆరోగ్య సమస్యలు కలుగుతాయి. ఆ క్రమంలో వాటిని వధించి తినడం వల్ల ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇన్‌ఫెక్షన్లు సోకడంతో పాటు అజీర్తి, విరేచనాలు, జ్వరం రావడం వంటి సమస్యలు సహజంగా తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యం అందడంలో ఆలస్యమైతే విషమించి ప్రాణం మీదకు తెచ్చుకునే ప్రమాదం ఉంది.

జీవాలను వధించే పద్ధతి ఇదీ..



జీవాలను వధించే పద్ధతి శాస్త్రీయంగా ఉండాలి. వధించడానికి ముందు, వధించిన తర్వాత పశువైద్యుడు జీవాన్ని పరీక్షించాలి. వధించిన మూడు గంటల తర్వాత మాంసంలో సహజ సిద్ధంగా బరువు, నాణ్యతల్లో మార్పులు చోటు చేసుకుంటాయి. విక్రయ దుకాణం వద్ద ఈ మాంసపు భాగాలకు దుమ్ము, ధూళి చేరి బాక్టీరియా, వైరస్‌లు ఆశ్రయించే అవకాశం ఉంది. విక్రయించగా మిగిలిన మాంసాన్ని తర్వాత ఏ మాత్రమూ విక్రయించరాదు. నిల్వ చేయదలిస్తే నిర్దిష్టమైన శీతలీకరణలో భద్రపరచాలి. వండే క్రమంలో మాంసాన్ని పూర్తిగా ఉడికించి వండుకోవాలి.

– బి.రామారావు, హెల్త్ ఎడ్యుకేటర్

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

ఆలమూరు: యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నాడిక్కడ సంఘ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి రూపొందించిన ఈ డైరీని గ్రామ టీడీపీ నేతలు ఆవిష్కరించారు.

మహిళల పూజలు

మలికిపురం: పిఠాపురంలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విజయంపై పడమటిపాలెంలో పార్టీకి చెందిన మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కాంజనేయస్వామి ఆలయంలో 108 కొబ్బరి కాయలు కొట్టి, హనుమాన్ చాలీసా చదివించారు.

నీటి ప్రవాహానికి అవరోధం



చల్లపల్లి ప్రధాన పంట కాలువ దుస్థితి

ఉప్పలగుప్తం: ఇటీవల వీచిన ఈదురు గాలులకు మండలంలో పలు చోట్ల వృక్షాలు నేలకొరిగాయి. ఈ చెట్లు పంట కాలువలో పడటంతో చెత్త చెదారం పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్నాయి. చల్లపల్లి ప్రధాన పంట కాలువలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు నేపథ్యంలో రైతులు నారుమడులు సిద్ధం చేసుకోవడానికి దమ్ము ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే పంట కాలువలో అడ్డగింతతో ప్రవాహం తగ్గి పొలాలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందటం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.